చట్టవ్యతిరేక కార్యకలాపాలు.. పట్టించుకోని అధికారులు

లాలాపేట: లాలాపేట, లాలాగూడ, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు పేకాట, సట్టా, క్రికెట్ బెట్టింగ్, గంజాయి వంటి మత్తు పదార్థాల క్రయవిక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. వీటికి యువత ఆకర్షితులై వారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాక వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ప్రజల అవసరాలను ఆసరగా అధిక వడ్డీలకు అప్పులిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో పేద మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ఇటీవలే లాలాపేట గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్టు చేయగా, తాజాగా లాలాపేట లక్ష్మీనగర్‌లో ఓ ఇంటిపై పేకాట ఆడుతున్న శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ వ్యక్తి మూడంతస్తుల భవనంపై నుంచి దూకి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. కుటుంబాలు ఆర్థికంగా అప్పుల పాలవ్వడంతో పాటు ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. లాలాగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు గత కొంత కాలంగా విచ్చల విడిగా కొనసాగుతున్న పట్టించుకునే వారు లేరా అన్ని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా పోలీసులు బస్తీల్లో పెట్రోలింగ్ నిర్వహించాన్నారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే అనుమానిత ప్రాంతాల్లో తరచూ తనికీలు చేపట్టాలంటున్నారు.

ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా


కొబ్బరికాయలు కొడుతున్న శ్రీగణేష్

రసూల్‌పురా: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం బొల్లారం డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయంలో టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ నరసింహన్ కన్నన్ ఆధ్వర్యంలో వెయ్యి కొబ్బరికాయల కొట్టి మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ.. శ్రీగణేష్ విజయం సాధిస్తే అమ్మవారికి వేయి ఒక్క కొబ్బరికాయ కొడుతానని మొక్కినట్లు పేర్కొన్నారు. శ్రీ గణేష్ విజయం సాధించడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరి అరవింద్, సీనియర్ నాయకులు బాలరాజ్, శ్రీధర యాదవ్, సుభాష్ రెడ్డి, సంపత్ నరేందర్, సతీష్, ఉదయ్‌భాను పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న ఆర్‌కే. ప్రసాద్

లాలాపేట: జాతీయ బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా తార్నాకకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు, మానవ హక్కుల కార్యకర్త, బీసీ ఉద్యమ నాయకులు రావులపల్లి కృష్ణప్రసాద్(ఆర్.కె. ప్రసాద్) నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షులు దేరంగుల ఉదయ్‌కిరణ్ ఆదేశాలతో సంఘం ఉపాధ్యక్షులు కదిరి రాము ఆదివారం నియామక ఉత్తర్వులను ఆర్‌కే ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌కే. ప్రసాద్ మాట్లాడుతూ.. బీసీల ఐక్యత, సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

బీసీ కులాల ప్రయోజనాలకు కృషి

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: బీసీ కులాల ప్రయోజనాలకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం బౌద్ధనగర్‌లో జరిగిన గంగపుత్ర సంఘం నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. అన్ని బీసీ కులాలు సంఘటితంగా వ్యవహరిస్తూ తమ హక్కులను కాపాడుకోవాల్సి ఉందన్నారు. తాము తొలి నుంచే బీసీ కులాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తున్నామన్నారు. అన్ని వెనుకబడిన కులాల వారికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారిని తమవంతు ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తాము బీసీల హక్కులను పొందేందుకు సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ, సంఘం నాయకులు దేశబోయిన రఘు, కైరంకొండ సత్యనారాయణ, ప్రభాకర్, పాకమూర్తి, బాలయ్య, హరి, సీనియర్ నాయకులు కంది నారాయణ, పుల్లయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం..

బౌద్ధనగర్: ఎస్‌ఆర్‌వీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య రంగంలో పేదలకు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తగిన వైద్య సదుపాయాలను కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యా, వైద్య రంగాలకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని, వాటిని పేదలకు చేరువలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ప్రత్యేకంగా ఆస్తమా, పల్మనాలజీ విభాగాలకు సంబంధించిన జబ్బులు గుర్తించి, ఉచితంగా వైద్యం అందించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుంకు రాంచందర్, పల్మనాలజిస్ట్ ఎండి సమీర్ అహ్మద్, మహమ్మద్ రాబ్బాని పాల్గొన్నారు.


వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

దళితుల అభ్యున్నతిని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

లిబర్టీ: దళితుల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను ఆయా రంగాలకు ఖర్చు చేయకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. సబ్‌ప్లాన్ కింద నిధులు కేటాయించడం తప్ప నిధులు విడుదల చేయలేదని చేసిన నిధులు కూడా సక్రమంగా ఖర్చు చేయలేదని అన్నారు. ఆదివారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2014 నుంచి 2024 వరకు ఒక లక్ష 41 వేల కోట్ల రూపాయలు ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ కింద కేటాయించారని.. ఖర్చు చేసింది మాత్రం రూ. 78 వేల కోట్లు మాత్రమే అని ఆయన తెలిపారు. 63 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయలేదని అసలు కేటాయింపులు జరగలేదని ఆయన ఆరోపించారు. పదేళ్ల కాలంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఎస్సీ అభివృద్ధి శాఖకు నిధులు కేటాయించడం తప్ప విడుదల చేయకపోవడం మరో వంక ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాల కోసం దారి మళ్లించడం తప్ప ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి జీవనస్థితిగతుల మార్పు కోసం మెరుగైన జీవన ప్రమాణాల కోసం గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబ్బులు ఖర్చు చేయలేదని అన్నారు. ఎస్సీలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు ఎలా దారి మళ్లిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా అన్యాయం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

డంపింగ్ యార్డుగా సైట్-3 శ్మశానవాటిక

పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం

రహమత్‌నగర్: బోరబండ సైట్-3 శ్మశానవాటిక డంపింగ్ యార్డుగా మారుతోందని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని పీజేఆర్ ఎస్పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎస్పీఆర్‌హిల్స్ పీజేఆర్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... బోరబండ శ్మశానవాటిక అభివృద్ధి కోసం లోకాయుక్త న్యాయస్థానం చొరవ, మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సహకారంతో రూ 1.75 లక్షలు మంజూరు చేయించామని గుర్తుచేశారు. అందులో కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అప్పటి నుంచి నేటి వరకు శ్మశాన కమిటీలను ఏర్పాటు చేస్తున్న ఓర్సు అడవయ్య, కాటి కాపారి లింగయ్యల అక్రమ సంపాదన, నిర్లక్ష్యం మూలంగా శ్మశానవాటిక డంపింగ్ యార్డుగా మారిందని ఆరోపించారు. దళితులంతా కలిసి శ్మశానవాటిక కమిటీ ఏర్పాటు చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వారు కోరితే తాము సహాయ సహ కారాలు అందిస్తామన్నారు. దళిత నాయకుడు గ్యార నాగరాజు మాట్లాడుతూ... శ్మశానవాటిక అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. శ్మశానవాటికలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం చైర్మన్ సీతారాంరెడ్డి, వైస్ చైర్మన్ గొలు సుల ఎల్లయ్య, సంఘం నాయకులు అబ్బయ్య, సుబ్బయ్య, వేముల వెంకటేశ్, భాస్కర్, కేశవులు, మాణిక్యం, సాయి పాల్గొన్నారు.

పార్కింగ్ ఇలా.. రాకపోకలు ఎలా?

- రోడ్లపై గంటల తరబడి నిలుపుతున్న ట్రావెల్స్ బస్సులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ
- స్థానిక నేతలకు ప్రతినెలా మాముళ్లు?
- రెచ్చిపోతున్న ట్రావెల్స్ యజమానులు


బాలంరాయిలో రోడ్డుపై నిలిపిన బస్సులు

రసూల్‌పురా: ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు ఇష్టానుసారంగా రహదారులు, రోడ్ల పక్కనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. బాలంరాయి, అన్నానగర్, బోయిన్‌పల్లి, మడ్‌ఫోర్ట్ ప్రాంతాల్లో నడిరోడ్డుపైనే బస్సులను నిలుపుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు, ఇతర వాహనదారులు వాపోతున్నారు. ప్రతి రోజు చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, ఉత్తరప్రదేశ్ ఇతర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో బస్సుల వరకు కంటోన్మెంట్‌లోని ఆయా ప్రాంతాలకు వచ్చి బస్సు వెనుక మరో బస్సు నిలుపుతూ ఇతర వాహనదారులను ఇక్కట్లకు గురి చేస్తున్నారు.

కమాన్ ధ్వంసం..

రోడ్డు చిన్నగా ఉన్న బాలంరాయి కమాన్ సమీపంలో నాలుగు రోజుల క్రితం బస్సును రిటర్న్ తీసుకునే సమయంలో శ్రీ దేవి దండుమారమ్మ దేవాలయ కమాన్‌ను బస్సు వెనుక భాగం ఢీకొట్టడంతో కమాన్ ధ్వంసమైంది. ఈ విషయమై స్థానికులు కంటోన్మెంట్ బోర్డు అధికారులకు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. కాగా స్థానికంగా ఉన్న ఓ కాంగ్రెస్ నేత బస్సుల నిర్వాహకుల నుంచి కమాన్ మరమ్మతుల రూ. 2 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నగర శివారు ప్రాంతాల నుంచి నడిపేలా స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి నిబంధనలను ఉల్లంఘిస్తున్న విషయమై స్థానికులు పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు అధికారులు, రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా బాలంరాయి పరిసర కాలనీ, బస్తీల్లో ఉండే కొందరు నేతలు బస్సుల యాజమాన్యాలను బెదిరిస్తూ ప్రతి నెల మాముళ్ల దండుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి అండదండలు ఉండడంతో బస్సుల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా బోర్డు, రవాణ, ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ధ్వంసమైన ఆలయ కమాన్

నేడు ఎమ్మెల్యే తలసాని పర్యటన

బన్సీలాల్‌పేట్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ నెల 10న (సోమవారం) బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో పర్యటించనున్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి చాచానెహ్రూనగర్, గాంధీ నగర్ ఏరియాల్లో పర్యటిస్తారని బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 లకు స్థానిక కార్పొరేటర్ హేమలతతో కలిసి రోడ్డు, కమ్యూనిటీహాల్ పనులను పరిశీలిస్తారన్నారు.

నేటి నుంచి ప్రజావాణి

సికింద్రాబాద్: ఎన్నికల కోడ్ కారణంతో నిలిపివేసిన ప్రజావాణి ఇక నుంచి ప్రతి సోమవారం కొనసాగించనున్నట్టు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయంలో ఈ నెల 10 నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందన్నారు. జోనల్ కార్యాలయం పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్, మల్కాజిగిరి, అంబర్‌పేట్ సర్కిల్ కార్యాలయాల పరిధిలోని ప్రజలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ప్రజావాణిలో తమ ఫిర్యాదులు అందించాలని ప్రజల నుంచి అందిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని జోనల్ కమిషనర్ వెల్లడించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 95, గింజ బీక్కుడు 50, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 28, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 34, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

'నీట్' అక్రమాలపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షను నిర్వహించి ఫలితాల పది రోజులు ముందుగా ప్రకటించడం దారుణమన్నారు. పరీక్ష నిర్వహణ, ఫలితాల విడుదలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో ఆదివారం గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 528 మందికి 330 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు.

ఛత్తీస్‌ఘడ్ బాలికల చేరదీత

సికింద్రాబాద్: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఇద్దరు బాలికలను చేరదీసిన సికింద్రాబాద్ రైల్వేపోలీసులు వారికి ఆశ్రయం కల్పించారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం 2వ ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా తచ్చాడుతున్న బాలికలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారని దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వచ్చినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న తల్లి తండ్రులకు సమాచారం అందించి సదరు బాలికలను నగరంలోని ఆశ్రమానికి తరలించారు.

మర్చిపోయిన ల్యాప్‌టాప్ అప్పగింత


అనిల్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్: రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడు మర్చిపోయిన ల్యాప్‌టాప్ ఇతర విలువైన వస్తువులను గుర్తించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు తిరిగి అప్పగించారు. మాదాపూర్‌లో నివాసముంటున్న అనిల్‌కుమార్ కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ఆదివారం మౌలాలి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు ఎక్కే హడావుడిలో తన ల్యాప్‌టాప్ బ్యాగును రైల్వేస్టేషన్‌లో వదిలి వెళ్లిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కే.కిష్టయ్య, మహిళా కానిస్టేబుల్ రంజనా నామ్‌దేవ్ రూ.55 వేల విలువ చేసే వస్తువులు కలిగిన సదరు బ్యాగును గుర్తించి భద్రపరిచారు. అందులోని పాన్‌కార్డు ఆధారంగా అనిల్‌కుమార్‌ను రప్పించి బ్యాగును అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 70 ఘటనల్లో రూ.19.50 లక్షల విలువ చేసే ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులు తిరిగి అప్పగించామన్నారు.

ఎన్‌బీటీనగర్ బస్తీ కమిటీ సమావేశం


సమావేశమైన సభ్యులు

సనత్‌నగర్: బేగంపేట ఎన్‌బీటీనగర్ బస్తీ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. బస్తీ కమిటీ కాల వ్యవధి ఇప్పటికే ముగియడంతో ఎన్నికలపై చర్చించారు. ఎన్నికలు జరిపి కొత్త కమిటీ ఎన్నుకునే వరకు బస్తీ నాయకులు, పెద్దలు బస్తీ బాగోగులు చూసుకోవాలని తీర్మానం చేశారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, శంషుద్దీన్, శేఖర్‌ముదిరాజ్, దేవేందర్, యాదగిరి, మారయ్య, నసీంబాను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత ధారణా శిక్షణ శిబిరం


నిర్వాహకులను సన్మానిస్తున్న ఏపీ పీసీసీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు

నల్లకుంట: సువర్ణ భారతి మహోత్సవాల్లో భాగంగా చిన్నారుల్లో జ్ఞాపక శక్తి, మేధాశక్తిని పెంపొందించేందుకు బాల గోకులం ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠంలో గత నెల 26న ప్రారంభమైన 'ఉచిత ధారణా (జ్ఞాపక శక్తి) శిక్షణ శిబిరం' ఆదివారంతో ముగిసింది. చివరి రోజున మఠం ప్రాంగణంలోని యాగశాలలో 'హయగ్రీవ హోమం' నిర్వహించారు. అనంతరం జరిగిన శిబిరం ముగింపు ఉత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ధారణా శిబిరం నిర్వాహకులను సన్మానించారు. దీనికి హాజరైన ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జేబీ.శ్యామ్‌రావు, ఎస్.హరినాథ్‌రెడ్డితో కలిసి శిబిరం నిర్వాహకులు లంక శ్రీరామమూర్తి, రామచంద్రరావులను శాలువాతో సన్మానించి నూతన వస్త్రాలు అందజేసి మాట్లాడారు. వేసవి సెలవుల్లో చిన్నారుల మేథోశక్తిని పెంపొందించే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు శరత్, కాంతారావు, దేవిరెడ్డి విజితారెడ్డి, సీహెచ్.మురళీకృష్ణ, మహేష్‌యాదవ్, శ్రవణ్‌కుమార్, సీహెచ్.లలిత ధారణా శిబిరం నిర్వాహకులు రామలింగేశ్వరరావు తదితరులున్నారు.

పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి రచించిన చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలియజేసే ప్రయత్నమే ఈ పుస్తకం అన్నారు. ఆరోగ్య సలహాలు మొదలు కొని జ్వరం, తలనొప్పి, గుండెపోటు, అగ్నిప్రమాదాలు, బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెజబ్బుల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల గురించి చికిత్స అందించడంలో వైద్యులు ఎదుర్కొనే సమస్యలు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచామన్నారు. తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రమణి, తెలంగాణ ఆయూష్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి, విజ్ఞానదర్శిని కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ కిట్స్ పంపిణీ

ఖైరతాబాద్: పేద విద్యార్థులకు విద్యాపరంగా ప్రోత్సహించేందుకు వాసవి సేవా కేంద్రం ఆదివారం విద్యా సహాయ నిధి కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్ కిట్స్ అందజేశారు. ఆదివారం వాసవి సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 400 మంది చిన్నారులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, లంచ్ బాక్స్, వాటర్ బాటిళ్లతో కూడిన ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ నల్లా సాయికిషోర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ విద్యార్థులకు కిట్స్ అందజేశారు. వాసవి సేవాకేంద్రం ప్రతి సంవత్సరం విద్యా నిధి పేరుతో పేద విద్యార్థులకు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. కొల్పూరు రమేష్, నాచం ప్రభాకర్, ఇల్లూరి నరేంద్ర కుమార్, రవికుమార్, కొండె మల్లికార్జున్, చీకట్ మర్ల అశోక్‌కుమార్, కమిటీ చైర్మన్ గంధె హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో రమేష్ బాబుకు బంగారు పతకం



ఉస్మానియా యూనివర్సిటీ: పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన రమేష్ బాబును శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ సైక్లింగ్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. గత నెల గచ్చిబౌలి స్టేడియంలో పాన్ ఇండియా నిర్వహించిన క్రీడా పోటీలలో 65 సంవత్సరాల కేటగిరిలో 70 ఏళ్ల రమేష్ బాబు బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. 14 రాష్ట్రాల నుంచి 400 మంది పరుగుపందెంలో పోటీ పడగా తాను మొదటి స్థానం నిలిచి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో 17 పతకాలను సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శాలిబండ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షులు భూపేందర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ సక్సేనా, కోశాధికారి అనురాగ్ రాజ్, దత్తాత్రేయ, కోచ్ కృష్ణ పాల్గొన్నారు.

విద్యకు అత్యంత ప్రాధాన్యం


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం కమిటీ నూతన అధ్యక్షుడిగా సోమ దయానంద్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం ప్యారడైజ్ వద్దనున్న ఆర్యవైశ్య అభ్యుదయ సంఘంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో దయానంద్‌ను కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆర్యవైశ్యులు ఇతర పేద విద్యార్థుల చదువుల కోసం ప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌లో రూ.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. తమ సంస్థను గతంలో కన్నా మరింత గొప్పగా వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

అడ్డగుట్ట: దేశ వ్యాప్తంగా మోదీ పాలనకు ప్రజలందరూ బ్రహ్మరథం పడుతున్నారనే దానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడమే నిదర్శనమని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం సాయంత్రం బీజేపీ నాయకులు తుకారాంగేట్‌లోని సుభాష్ బొమ్మ వద్ద సంబరాలు చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా ప్రజలు చూపిస్తున్న ఆదరణ, అభిమానాలు ఇదే విధంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కన్నా భిరం, కృష్ణ, నర్సింగ్‌రావు, సాయిబాబా, రవీందర్, ఉదయ్ యాదవ్, మహేందర్, సాయన్న, స్వామి, అక్షయ్, శ్యామ్, శ్రీనివాస్, ప్రేమ్‌రాజ్, గోవింద్ చారి, చింటు పాల్గొన్నారు.

తార్నాక చౌరస్తాలో ..



లాలాపేట: నరేంద్రమోదీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం తార్నాక చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెడుతూ సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రివర్గంలో చోటు లభించడంపై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచయ్య యాదవ్, వెంకటేష్‌గౌడ్, కొన్నె సంపత్, మల్లికంటి వీరన్న, శ్రీనివాసచారి, ఉపేందర్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, గోవర్ధన్, వేణుయాదవ్, ప్రకాష్‌గౌడ్, గంటికోట నర్సింహా, వేణు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జనగామకు సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

లిబర్టీ: సామ్రాజ్యవాదులను గడగడలాడించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును ఒక జిల్లాకు పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాక భువనగిరి కోటగా సుభిక్షంగా పరిపాలన సాగించిన సర్దార్ పాపన్నగౌడ్ చరిత్రలో తన పేజీని నిలుపుకొన్నారని ఆయన గుర్తు చేశారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ జిల్లాగా పేరు నామకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు త్వరలో జరిగే రాష్ట్ర కేబినేట్‌లో సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెడుతూ తీర్మానం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. జనగామ సమీపంలోని ఖిలా షాపూర్‌లో జన్మించిన సర్దార్ పాపన్నగౌడ్ భువనగిరి కోట కేంద్రంగా పరిపాలన సాగించి ప్రజాసంక్షేమం కోసం పాటుపడి చరిత్రలో మిగిలిపోయారని కుమారస్వామి పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం చాటేలా ప్రపంచానికి తన పోరాటపటమను చూపించారన్నారు.

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి

వెంగళరావునగర్: తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల టీచర్లు కోరారు. ఆదివారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన టీచర్లతో కలిసి విద్యార్థినీవిద్యార్థులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. యూసుఫ్‌గూడ ప్రధాన రహదారి, లక్ష్మీనరసింహానగర్, శ్రీకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లు మాట్లాడుతూ... యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ ఆర్మీ శిక్షణ కూడా విద్యార్థులకు ఇస్తున్నారన్నారు. పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారం, మధ్యాహ్న భోజనం అందుతుందని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లోనే చేర్పించాలని కోరారు. స్కూల్ టీచర్లు శ్రీదేవి, పావని, మాలతి, రాధాబాయి, తిరుపతమ్మ, వందన, ఉమర్, ఎన్‌సీసీ టీచర్ పి.ప్రభాకర్, ఎన్‌సీసీ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.